# అంచనాకు అందని సంస్కారం



'తెలుగు విద్యార్థి' మాసపత్రిక . . . జూన్, 2001

"ఒరేయ్ మూర్తీ!

మనం కలుసుకుని ఏన్నాళ్లయిందిరా! నాళ్లు కాదు– ఏళ్లు! ఇరవైయ్యేళ్లు అవుతోంది. మనం ఉత్తరాలు రాసుకుంటూనే ఉన్నాం అనుకో– ఉత్తరాలలో నీ మనసుని చదవగలనే కానీ, నీ రూపాన్ని చూడలేనుగా! నిన్ను చూడాలని మనసు ఎంత ఆరాటపడుతుందో– ఆ విషయం చెప్పలేను! నిజానికి చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే... నువ్వు కూడా నన్ను చూడాలని అంతగా ఆరాటపడ్తుంటావని నాకు తెలుసు.

ఇంత కాలానికి మేము అందరం మన ప్రాంతాలకు వస్తున్నాం. మీ మరదలు– అదే మా ఆవిడ ఎప్పుడెప్పుడో మొక్కుకున్న మొక్కులన్నిటినీ ఒక్క రౌండ్‌లో ఆ ఏడు కొండలవాడికి తీర్చుకోడానికి మేము వస్తున్నాం! మొక్కు అనేది ఒక వంక మాత్రమే. ఆ వంకతో నైనా మన వైపు రావడానికి వీలవుతోంది. కాని, మొక్కు కన్నా, ఆ వేంకటేశ్వరస్వామి దర్శనం కన్నా నాకు కావలసింది నీ దర్శనం!

ఈ నెల 25వ తేదీన మార్నింగ్ ఫ్లైట్‌లో హైదరాబాద్‌లో వాలుతాం. వచ్చేముందు మళ్లీ ఫోన్ చేస్తా! ఈ ఇరవై ఏళ్లలో ఎన్ని మార్పులు వచ్చాయో! నేను కొంచెం బాలుడు (బాల్డ్) నయ్యాను కాని, పెద్దగా మారలేదు. మీ మరదలు మరీ తొందరపడి చప్పిడి దవడలను, తెల్లజుట్టును పెంచేసింది. ఆవిడని చూస్తే 'అయ్యో...' అనుకుంటావు. అయితే మా అమ్మాయి రేఖను చూస్తే మాత్రం 'అబ్బో...' అనుకుంటావు.

మీ అబ్బాయిలు ఎలా ఉంటారో ఊహించుకోలేకపోతున్నాను. సినిమా హీరోల్లాగా ఉంటారని అనుకుంటున్నాను. మా వదిన ఎలా ఉంది? ఎలా ఉన్నా ఆమె అందంగానే ఉంటుంది. అందర్నీ అడిగానని చెప్పు. మీ వద్దకు రావడం ఎప్పుడెప్పుడా... అని ఆత్రంగా ఉంది. ఈ ఇరవైయ్యేళ్లు అంతగా అనిపించలేదు కాని, ఏమిటో... ఈ పదిరోజులూ పది యుగాలేమో అనిపిస్తోంది. అసలు 'కాలం కదులుతోందా?' అని అనిపిస్తోంది.

నీ

శేఖర్"

ఆ ఉత్తరం చదివేసరికి మూర్తికి పట్టరాని సంతోషం వేసింది.

ప్రాణస్నేహితుడు కళ్ళముందు ఉన్నట్లే అనిపించింది. 'వెధవకి– వయసు పైబడుతున్నా హాస్యం తగ్గలేదు. అయినా వాడికి వయసు మీద పడడమేమిటి? వయసు వాడి దగ్గరకు రావడానికి కూడా భయపడ్తుంది. వాడు నిత్యయవ్వనుడే! యమధర్మరాజు వచ్చి పిలిచినా ఓ జోకు వేసి కాని కదలడు!' అని తనలో తనే అనుకున్నాడు మూర్తి.

మూర్తి స్మృతులు ఇరవైయేళ్లు వెనక్కివెళ్లాయి. తనూ, శేఖర్ చిన్నతనం నుంచి క్లాస్‌మేట్స్! క్లాసులో కూడా ప్రక్కప్రక్క సీట్లు! పైగా... ఇద్దరికీ కామన్ ఇంటరెస్టులు. దాంతో ఇద్దరికీ ప్రాణస్నేహం అయింది.

దానికితోడు ఇళ్లు కూడా దగ్గర దగ్గరగా ఉండడంతో ఆదివారాలు, సెలవు రోజుల్లో కూడా కలుసుకుంటుండేవారు. కాలేజీలోకి వచ్చాక తండ్రుల బదిలీల మూలంగా ఇద్దరూ విడిపోయారు. శేఖర్ ఢిల్లీ వెళ్లిపోయాడు. అక్కడ యం.సి.ఏ. కోర్సు చేసి ఒక పెద్ద కంప్యూటర్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కుదురుకున్నాడు.

తాను యం.బి.యే. చేసి హైదరాబాద్‌లోనే మల్టీనేషనల్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా చేరాడు. ఉద్యోగం కూడా రావడంతో, అదికూడా మంచిఉద్యోగం కావడంతో తనకి మంచి సంబంధం వచ్చింది. అన్నివిధాలా తగిన వనజతో వివాహం అయింది. శేఖర్ అమెరికా వెళ్లే ఉద్దేశం ఉండడంతో పెళ్ళి చేసుకోలేదు.

మరుసటి సంవత్సరమే తనకి మగపిల్లవాడు పుట్టాడు. బారసాలకి ఢిల్లీ నుంచి తన తల్లిదండ్రులను వెంటబెట్టుకుని వచ్చాడు శేఖర్. తన కొడుకుని చూసి ఎంతగానో మురిసిపోయాడు. వాడికి రవికిరణ్ అని పేరు పెట్టమని సూచించాడు. పేరు బాగుంది. దానికితోడు ప్రాణమిత్రుడు సూచించాడు. దాంతో పిల్లవాడికి ఆ పేరే పెట్టారు.

ఏడాదికి ఒక ఇంక్రిమెంట్ వచ్చినట్లు తనకి మరుసటి సంవత్సరం మళ్లీ మరో బాబు పుట్టాడు. అయితే ఇంకో ఇంక్రిమెంట్‌కి అవకాశం లేకుండా వాసెక్టమీ చేయించుకున్నాడు. వీడి బారసాలకు కూడా శేఖర్ వచ్చాడు.

"ఒరేయ్ః... వీడికి కూడా నువ్వే పేరు పెట్టు!" అన్నాడు తను. శశికిరణ్ అని సూచించాడు శేఖర్. ఆ పేరే పెట్టారు బాబుకి.

"ఒరేయ్ః... అప్పుడే నేను ఇద్దరు పిల్లల తండ్రినయ్యాను. నువ్వేమో ఒంటికాలు సొంఠికొమ్ము లాగా ఉండిపోయావు. బ్రహ్మచారి ముదిరినా, బెండకాయ ముదిరినా పనికిరాదంటారన్న సామెతను నీకు గుర్తుచేయాలా ఏమిటి? మరి, నువ్వు కూడా పెళ్ళి చేసుకుని నాకు కనీసం ఒక కోడలినైనా కనియ్యవా?" అన్నాడు తను.

"కనేది నేను కాదోయ్ః... మీ చెల్లెలు!" అన్నాడు శేఖర్.

"అదే... ఆ చెల్లెలు ఎప్పుడొస్తుందనే నా ప్రశ్న?!" అన్నాడు తను.

"నేను 'తెర తీయగరాదా...' అనగానే తెర తొలగించుకు వచ్చేస్తుంది. నాకు అమెరికా ఉద్యోగం ఇంచుమించు ఖాయం అయింది. అది ఫైనలైజ్ కాగానే వెళ్లే

ముందుగానో, వెళ్లాకనో చేసుకుంటాను. నీకు శుభవార్త ముందుగానే చెప్తాను" అన్నాడు శేఖర్.

"ఎప్పుడు పెళ్ళి చేసుకుంటావో, ఎప్పుడు అమ్మాయిని కంటావో?! అంతా అయితే, గియితే వ్యవహారంగా ఉంది!" అన్నాడు తను.

శేఖర్ నవ్వి ఊరుకున్నాడు. అయితే అన్నట్లుగానే నాలుగు నెలలలోనే వాడి పెళ్ళి ఖాయం అయింది. అమ్మాయిది కూడా ఢిల్లీయే! అక్కడ స్థిరపడ్డ తెలుగువాళ్ళ అమ్మాయి పేరు అనిత! ఆ అమ్మాయి కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్!

శేఖర్ పెళ్ళికి తాను సకుటుంబంగా వెళ్లాడు. అనితను చూస్తే ముచ్చటేసింది.

'వెధవ... ఆలస్యంగా చేసుకుంటే చేసుకున్నాడు కాని, మంచి సంబంధం దొరికింది. అన్నివిధాలా అనువైన భార్య దొరికింది!' అనుకున్నాడు తను.

పెళ్ళయిన రెండు నెలలకే శేఖర్ భార్యతో సహా అమెరికా వెళ్లిపోయాడు. అక్కడ ఇద్దరికీ మంచి ఉద్యోగాలు దొరికాయి.

ఏడాది తిరక్కుండా అనిత నీళ్లు పోసుకుంది. మొదటి కాన్పు కావడంతో తండ్రి ఢిల్లీకి తీసుకువచ్చాడు. పురిటి సమయానికి శేఖర్ కూడా ఇండియాకి వచ్చాడు. అనిత ఆడపిల్లను ప్రసవించింది. బారసాలకి తను సకుటుంబంగా వెళ్లాడు.

అనిత పాప చాలా అందంగా ఉంది. బొద్దుగా, ముద్దుగా ఉంది. అనిత కూడా ఎంతో కలుపుగోలుగా తనని 'అన్నయ్యగారూ' అనీ, వనజని 'వదినా' అని పిలుస్తూ ఆప్యాయత చూపించింది.

"ఒరేయ్... నీ కొడుకులకి పేర్లు నేను పెట్టాను. మరి, నా కూతురికి పేరు నువ్వే పెట్టాలి!" అన్నాడు శేఖర్.

"నేను పెట్టకపోతే ఇంకెవరు పెట్తారు? ఇది నా కోడలు! నేను పేరు ఆలోచించే ఉంచాను. మా అబ్బాయిలకు 'కిరణ్' అని పేరు పెట్టావు. నేను మీ అమ్మాయికి 'కాంతి' అని పేరు పెట్టున్నాను" అన్నాడు తను.

"పేరు బాగుంది!" అన్నారు శేఖర్, అనితలు.

"ఒరేయ్... ఇప్పుడే నీ నోటితో అన్నావు- కాంతి నీ కోడలని! ఆ మాట ఖాయం చేసుకుందాం!" అన్నాడు శేఖర్.

అనిత ముందు అతను అలా మాట్లాడడం ఇబ్బందిగా అనిపించింది. ఏమీ అనలేక అనిత వంక, శేఖర్ వంక చూశాడు తను. తన ఇబ్బందిని గ్రహించిన శేఖర్ అన్నాడు.

"మీ చెల్లాయికి చెప్పకుండానే అడిగాననుకుంటున్నావా? ఈ ఆలోచన నాకు ఉండనే ఉందనుకో! అది బయటపెట్టకుండానే మీ చెల్లాయే అంది."

"అవునన్నయ్యగారూ! మా అమ్మాయి మీ ఇంటికోడలు కావడం కంటే అదృష్టం ఏమి ఉంటుంది?" అంది అనిత.

"సర్లే... నాకు ఇద్దరబ్బాయిలు అన్న విషయం గుర్తుందా?" అన్నాడు తను.

"ఆ ఇద్దరిలో ఎవర్ని చేసుకున్నా అయ్యేది మీ ఇంటికోడలేగా! ఎవరికి చేసుకోవాలనేది మీ ఇష్టం!" అంది అనిత.

"బాగానే ఉంది! పిల్లలు ఈతరం వాళ్ళు. తల్లితండ్రులు చూసి పిల్లల పెళ్ళిళ్లు నిర్ణయించే రోజులు కావివి. మనం ఇప్పుడు అనుకుంటే సరిపోయిందా? వయసు వచ్చాక ఎవరి ఆలోచనలు ఎలా ఉంటాయో?!" అన్నాడు తను.

"ఆ మాట నిజం! అయితే మన వరకు ఓ.కే. చేసుకుందాం! ఇది వాళ్ళకి బ్యాక్‌గ్రౌండ్ అన్నమాట! ఈ బ్యాక్‌గ్రౌండ్ నచ్చి వాళ్ళు ఫ్రంట్ గ్రౌండ్‌లోకి వచ్చారా... సంతోషం! లేదా, నో రిగ్రెట్స్! మనం ఎవరినీ బలవంత పెట్టేది లేదు" అన్నాడు శేఖర్.

"ఆ మాట నిజం... బాగుంది!" అన్నాడు తను.

ఆ గతం అంతా గుర్తుకొచ్చి మనసు ఆనందంతో నిండిపోయింది. ఇప్పుడు శేఖర్‌గాడి కూతురు ఎలావుందో?! 'పి.జి. ఫైనలియర్ ఎగ్జామ్స్ రాసిందని ఇంతకుముందు రాశాడు' అనుకున్నాడు.

తన కొడుకులు కూడా చదువులు పూర్తిచేసి ఉద్యోగాలు చేస్తున్నారు. బహుశా శేఖర్, అనితలు వాళ్ళ అమ్మాయి పెళ్ళివిషయం కదుపుతారేమో!' అనిపించింది.

ఉత్తరంలో రాసిన ప్రకారం... శేఖర్, అనిత, కాంతిలు 25వ తారీఖున మార్నింగ్ ఫ్లయిట్‌లో బేగంపేట విమానాశ్రయంలో దిగారు.

వారిని రిసీవ్ చేసుకోడానికి మూర్తి, వనజ వెళ్లారు.

శేఖర్‌లో పెద్ద మార్పు లేదు. అనిత ముఖంలో కొంచెం వయసు కనిపిస్తున్నా ఆకర్షణ తగ్గలేదు.

కాంతి అయితే పేరుకి తగ్గట్లు మెరుపుతీగలా మెరిసిపోతోంది. ఢిల్లీలో పుట్టి, అమెరికాలో పెరిగినందుకేమో... పూర్తిగా అధునాతనంగా ఉంది. సంతోషించదగ్గ విషయమేమిటంటే– కాంతి తెలుగు మరిచిపోకుండా చక్కగా మాట్లాడుతోంది. అయితే... మనిషిలో అడుగడుగునా దర్పం, అతిశయం కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి.

అందరూ ఇంటికి వెళ్లారు. నిండు యవ్వనంలో వున్న రవికిరణ్, శశికిరణ్‌లు శేఖర్ ఊహించినట్లుగానే సినిమా హీరోల్లాగా గ్లామరస్‌గా ఉన్నారు. చదువు, రూపం, మంచి ఉద్యోగం... వాళ్ళకి అన్నీ ప్లస్ పాయింట్లే!

ఉన్న వారంరోజులూ ఆ రెండు కుటుంబాలకి ప్రతిరోజూ పండగగానే గడిచింది. ఏరోజు కారోజు కాంతి పెళ్ళి విషయం శేఖర్ కదుపుతాడేమోనని చూశాడు మూర్తి.

శేఖర్ మౌనం అతనికి అర్థంకాలేదు.

'ఒకవేళ అమెరికాలో వున్న అతని స్థాయికి తన సంబంధం చాలదనుకుని మనసు మార్చుకున్నాడా?' అనిపించింది. కాని, శేఖర్ మనస్తత్వం తెలిసిన తనకు అతను అలా మనసు మార్చుకుంటాడనిపించలేదు. తానుగా అడగడానికి అభిమానం అడ్డువస్తోంది. ఎంతైనా... మగపెళ్ళివారుగా!

శేఖర్ వాళ్ళు వెళ్లిపోయే రోజు వచ్చింది.

ఆరోజు అనిత చాలా ఆందోళనగా ఉన్నట్లనిపిస్తోంది. మిత్రులు ఇద్దరూ టిఫిన్ చేసి, కాఫీ త్రాగుతున్నారు. కాంతి, రవికిరణ్, శశికిరణ్‌లు ఏవో కంప్యూటర్ గేమ్స్ ఆడుకుంటున్నారు. వనజ వంటింట్లో ఉంది.

ఇంక ఉండబట్టలేక అనేసింది అనిత- శేఖర్‌తో... "ఏమండీ! మీరు అన్నయ్యగారిని ఏదో అడుగుతానన్నారు... మర్చిపోయారా?" అంది.

"ఏమిత్రా... మా చెల్లాయి ఏమిటో అంటోంది?" అన్నాడు మూర్తి.

ఇంక తప్పదనుకుని మనసులోని మాట బయటపెట్టాడు శేఖర్.

"ఏం లేదురా! మనం ఎన్నో అనకుంటాం. అవన్నీ జరిగితే ఇంకేమి ఉంది? అందుకే అన్నారు- 'మాన్ ప్రపోజెస్, గాడ్ డిస్పోజెస్' అని! 'మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' అని!"

అతని మాటలకు అడ్డొస్తూ, "ఈ ఉపోద్ఘాతం ఎందుకురా! కాంతి వేరెవరినైనా ప్రేమించిందా? అయితే మాత్రమేమిటి- ఆ అబ్బాయికే ఇచ్చి చేయి!" అన్నాడు మూర్తి.

"అదికాదురా! ఇక్కడికి వచ్చేవరకు కూడా నేను, అనిత- కాంతిని నీ కోడలిని చేసుకోమని అడగాలనే అనుకున్నాం. కాని, ఇక్కడికి వచ్చి మీ ఇల్లు, సంసారం, మీ పిల్లలు, వాళ్ళ బుద్ధులు చూశాక మీ ఇల్లు ఒక 'పంచవటి' అనిపించింది. మీ పెంపకం ఎటువంటిదో కాని- మీ అబ్బాయిలు ఇద్దరూ మహా బుద్ధిమంతులుగా తయారయ్యారు. పంచవటి వంటి మీ ఇంట్లో శూర్పణఖ వంటి నా కూతురిని పడేసి మీ ఇంటిని

నరకప్రాయం చేయలేను. మీ మంచితనాన్ని ఆసరా చేసుకుని మిత్రద్రోహం చేయలేను..." అన్నాడు. ఆ మాటలు అంటుంటే శేఖర్ కళ్ళు చెమర్చాయి.

"అదేమిటిరా? కాంతి మంచిదేగా! కాస్త గర్వం, అతిశయం ఉండవచ్చు... పెళ్ళయితే అన్నీ సర్దుకుంటాయి!" అన్నాడు మూర్తి.

"లేదురా..! దాని సంగతి నాకు బాగా తెలుసు. డామినేటింగ్ టైప్! విపరీతమైన సెల్ఫిష్‌నెస్! తన మాటని ఏమాత్రం కాదన్నా హెల్ క్రియేట్ చేస్తుంది. అదివున్న ఇంట్లో శాంతి ఉండదు. మీ అబ్బాయిలు ఇద్దరూ మహా మెతకవాళ్ళు! వాళ్ళలో ఏ ఒక్కరూ దీనితో పడలేరు. అందుకే ఈ నిర్ణయానికి వచ్చా!" అన్నాడు శేఖర్.

"ఆ మాట నిజం అన్నయ్యగారూ! కూతురి మీద ప్రేమతో, ఆయన మీద వత్తిడి తేవాలనుకున్నాను కానీ, మీ ఇంటి వాతావరణం చూశాక ఆయన చెప్పింది నిజమే ననిపించింది. ప్రశాంతంగా వున్న మీ ఇంట్లో కల్లోలం సృష్టించలేము" అంది అనిత.

సొంతకూతుర్ని గురించి ఆ విధంగా మాట్లాడుతున్న ఆ దంపతుల సంస్కారం, హిమవన్నగం కంటే ఉన్నతమనిపించింది మూర్తికి.

"మరి, అలాగయితే అమ్మాయికి పెళ్ళే చేయవా?" అని అడిగాడు.

"ఎందుకు చేయను? రౌతు కొద్దీ గుఱ్ఱం అన్నారు. దీనిని లొంగదీసుకుని దారికి తీసుకురాగలడన్న నమ్మకం కలిగినవాడికి ఇస్తాను. అది మారిందా సంతోషం! లేదా దాని ఖర్మ- వాడి ఖర్మ!" అన్నాడు శేఖర్.

మరేమీ మాట్లాడలేక మౌనంగా ఉండిపోయాడు మూర్తి.

'తెలుగు విద్యార్థి' మాసపత్రిక . . . జూన్, **2001**

అమ్మకానికి అందుబాటులో ఉన్న
కె.ఆర్.కె. మోహన్ ఇతర రచనలకై ఈ పుస్తకం చివరి పేజీల్లో చూడండి...